
జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
మంగళవారం
25-08-2026
సంపుటి 1 సంచిక 273
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



"కేసీఆర్.. చితి చివరిదాక"
రాహుల్ రామకృష్ణ పోస్ట్ వైరల్
సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారిన నటుడి వ్యాఖ్య 4లో

24 నుంచి 36 గంటల్లో
## 22ఏ భూముల సమస్య పరిష్కారం

నిషేధిత జాబితాలోని జెన్యూన్ భూములకు రిజిస్ట్రేషన్లు: మంత్రి పొంగులేటి

22ఏ సమస్యలపై ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

ఫేక్ జీవోలపై కఠిన చర్యలు



**దశ, హైదరాబాద్:** 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ లేదా నిషేధిత భూములు కాకపోయినా 22ఏ జాబితాలో చేరిన జెన్యూన్ భూములు, స్లాట్ బుక్ చేసుకున్న వాటి సమస్యలను 24 నుంచి 36 గంటల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారిలో 98 శాతం మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. సంబంధిత ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, త్వరలో జీవో కాపీలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. గతంలో 22ఏ నుంచి రిలాక్సేషన్ పొందిన భూములు తిరిగి జాబితాలోకి వచ్చినా వాటిని కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. 22ఏ భూములపై ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు ఇప్పటివరకు 1,162 కాల్స్

..మిగతా 4వ పేజీలో →



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కేంద్రం
# అవమానించింది

అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం..

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

**దశ, హైదరాబాద్:** అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌కు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చి.. తెలంగాణ సీఎంగా తన పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా పెట్టుబడులు, విద్య, క్రీడా రంగాల్లో అంతర్జాతీయ సహకారం కోసం అమెరికా పర్యటనకు వెళ్లాలని ముందుగానే కేంద్రానికి వివరాలు సమర్పించామని తెలిపారు. యూకే పర్యటనకు అనుమతిచ్చిన కేంద్రం.. అమెరికా పర్యటనకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లండన్ పర్యటనలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రముఖ సంస్థలతో చర్చలు జరిపినట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేయించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమెరికా పర్యటనకు తాను వెళ్లలేకపోయినా రాష్ట్ర అధికారులు అక్కడికి వెళ్లి పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు జరుపుతున్నారని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోబోతున్నట్లు వెల్లడించారు.

### "కేంద్రం నన్ను అడ్డుకోగలదు.. నా ఆలోచనలను కాదు"

తన విదేశీ పర్యటనను అడ్డుకున్నా తెలంగాణ అభివృద్ధి కోసం పెట్టుబడుల సాధనను ఆపలేరని రేవంత్‌రెడ్డి

..మిగతా 4వ పేజీలో →



## 7 నుంచి అసెంబ్లీ

నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించండి

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై నిర్లక్ష్యం చేయవద్దు

మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం

అంతకుముందు సీఎంతో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

**దశ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశా లకు తేదీ దాదాపుగా ఖరారయ్యింది. సెప్టెంబర్ 7నుంచి అసెంబ్లీ సమావేశా లు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం సచి వాలయంలో అందుబాటులో

..మిగతా 4వ పేజీలో →

## కొండా సురేఖ అంశం పార్టీ చూసుకుంటుంది

వ్యాఖ్యానించడానికి నిరాకరించిన సీఎం రేవంత్ రెడ్డి



**దశ, హైదరాబాద్:** కొద్ది రోజులుగా నడుస్తోన్న మంత్రి కొండా సురేఖ అంశం పై వ్యాఖ్యానించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరాకరించారు. ఇంగ్లాడ్ పర్యటన తరువాత సోమవారం హైదరాబాద్ కు చేరుకున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశాన్ని మీడియా ప్రస్తావించింది. ముఖ్యమంత్రి బదులిస్తూ కొండా సురేఖ అంశం పార్టీ చూసుకుంటుంది.. ఆ అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉంది.. పార్టీ అంతర్గత అంశాలపై మాట్లాడను.. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాలని అన్నారు.

ఈగల్ శాఖలో
## ఇంటి దొంగల బాగోతం

డ్రగ్స్ పెడ్లర్లతో చేతులు కలిపిన కానిస్టేబుళ్లు!

రూ.50 లక్షల విలువైన ఎక్టసీ మాత్రల అక్రమ విక్రయానికి యత్నం.. అంతర్గత విచారణ




**దశ, హైదరాబాద్:** డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేస్తున్న ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుళ్లు డ్రగ్స్ దందాకు పాల్పడ్డారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈగల్ శాఖకు చెందిన కానిస్టేబుళ్లు నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వీరు సుమారు రూ.50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను స్వాధీనం చేసుకున్నప్పటికీ.. ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయకుండా అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రగ్స్ విక్రయించేందుకు ఏకంగా పెడ్లర్లను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో కానిస్టేబుళ్ల వ్యవహారం

..మిగతా 4వ పేజీలో →



528.58 చదరపు అడుగుల్లో
## ఇందిరమ్మ ఇల్లు

హైదరాబాద్‌లో 7,680 ఇళ్లకు నిర్మాణ అనుమతుల ప్రక్రియ ప్రారంభం

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ అనంతరం నిర్మాణ అనుమతుల కోసం గృహ నిర్మాణ సంస్థ అధికారులు సంబంధిత

..మిగతా 4వ పేజీలో →



## జాబ్ నోటిఫికేషన్లు నిల్ లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్

121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్లు

ఆగమేఘాల మీద విడుదల

మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధ

మాజీ మంత్రి హరీష్‌రావు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జాబ్ నోటిఫికేష న్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. 121 రకాల మద్యం


..మిగతా 4వ పేజీలో →

## పేరు గొప్ప.. నాణ్యత దిబ్బ!

150 టాప్ కంపెనీలకు నోటీసులు..

దిగ్గజాల ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా

**దశ, హైదరాబాద్:** పేరు గొప్ప.. నాణ్యత మాత్రం అంతంతేనా? దేశంలోని ప్రముఖ ఫుడ్ కంపెనీలు, రెస్టారెంట్లు, హోటళ్లు నాణ్యత ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నట్లు ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (FSSAI) చేపట్టిన తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు తప్పుడు ప్రకటనలు, మోసపూరిత వాదనలు, నిబంధనలకు విరుద్ధమైన లేబెలింగ్‌పై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత కొన్ని నెలల్లో నెస్లే ఇండియా, పెప్సికో, కోకాకోలా, అబాట్ ఇండియా, రెడ్‌బుల్, డానోన్, మోండెలెజ్, డయాజియో, ఫెర్రెరో ఇండియా తదితర ప్రముఖ సంస్థలకు కలిపి 150కి పైగా నోటీసులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. కేఎఫ్‌సీ, మెక్‌డొనాల్డ్స్, పిజ్జా హట్, డొమినోస్, కాఫీ డే వంటి ఫుడ్ సర్వీస్ సంస్థలకు 30కి పైగా నోటీసులు అందాయి. నిబంధనలు పాటించని డొమినోస్‌కు చెందిన ఐదు లైసెన్సులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అమెజాన్‌కు




చెందిన ఓ వేర్‌హౌస్ లైసెన్స్‌ను కూడా రద్దు చేశారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు కలిపి 12 నోటీసులు జారీ అయ్యాయి. ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాలిక్ పానీయాల తయారీ సంస్థలపై కూడా తనిఖీలు నిర్వహించి నిబంధనలకు

..మిగతా 4వ పేజీలో →



## ఆటో, క్యాబ్ కార్మికుల సమ్మె విరమణ

ప్రభుత్వంతో చర్చలు సఫలం.. డిమాండ్ల పరిష్కారానికి హామీ

**దశ, హైదరాబాద్:** తెలంగాణవ్యాప్తంగా చేపట్టాల్సిన ఆటో, క్యాబ్ కార్మికుల సమ్మెను జేఏసీ నేతలు విరమించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు సఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆటో ఛార్జీల సవరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓలా, ఉబర్ తరహా

..మిగతా 4వ పేజీలో →

# "కేసీఆర్.. చితి చివరిదాక"..

## రాహుల్ రామకృష్ణ పోస్ట్ వైరల్

### సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారిన నటుడి వ్యాఖ్య

**దశ, హైదరాబాద్:** టాలీవుడ్ నటుడు రాహుల్ రామకృష్ణ ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "చితి చివరిదాక... కేసీఆర్!" అంటూ ఆయన చేసిన పోస్ట్ రాజకీయ, సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ పోస్ట్‌ను ఏ సందర్భంలో చేశారనే దానిపై రాహుల్ రామకృష్ణ స్పష్టత ఇవ్వలేదు. అయితే బీఆర్ఎస్ మద్దతుదారులు, కేసీఆర్ అభిమానులు పోస్టును షేర్ చేస్తూ మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు నెటిజన్లు ఆయనపై విమర్శలు చేస్తున్నారు. రాజకీయ అంశాలపై రాహుల్ రామకృష్ణ గతంలోనూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదమయ్యాయి. తెలంగాణ రాజకీయాలపై కేసీఆర్, కేటీఆర్‌లను ట్యాగ్ చేస్తూ గతంలో చేసిన పోస్టులు కూడా చర్చనీయాంశమయ్యాయి. 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం', 'బ్రోచేవారెవరురా', 'జాతిరత్నాలు', 'ఆర్ఆర్ఆర్', 'ఓం భీమ్ బుష్' తదితర చిత్రాలతో రాహుల్ రామకృష్ణ నటుడిగా గుర్తింపు పొందారు.

## 4 కోట్ల తెలంగాణ ప్రజలను కేంద్రం

# అవమానించింది

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. గుజరాత్ సీఎంకు అనుమతిచ్చి తెలంగాణ సీఎంకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్రం నిర్ణయం వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు.

## ఆటో, క్యాబ్ కార్మికుల సమ్మె విరమణ

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యేక యాప్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు సాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పేరు గొప్ప.. నాణ్యత దిబ్బ!

**మొదటి పేజీ తరువాయి**

విరుద్ధంగా ఉన్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నోటీసుల అనంతరం పలు కంపెనీలు తమ ప్రకటనలు, లేబెలింగ్‌లో మార్పులు చేసుకునే చర్యలు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. ఇదిలా ఉండగా దేశంలోని పలు నగరాల్లో ఫైవ్‌స్టార్ హోటళ్లు, ప్రముఖ రెస్టారెంట్లలో నిర్వహిస్తున్న తనిఖీల్లో అపరిశుభ్ర పరిస్థితులు బయటపడుతున్నాయి. కుళ్లిపోయిన మాంసం, పాడైపోయిన ఆహార పదార్థాలు అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్నాయి. దీంతో బ్రాండ్ పేరు ఎంత పెద్దదైనా.. వినియోగదారులకు అందించే ఆహారం నాణ్యతపై రాజీ పడితే చర్యలు తప్పవన్న సందేశాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేస్తోంది

## ఈగల్ శాఖలో

# ఇంటి దొంగల బాగోతం

**మొదటి పేజీ తరువాయి**

వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. గతంలో నరహరి, స్వామి పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్లలో పాల్గొని అవార్డులు కూడా అందుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవహారాన్ని ఈగల్ అధికారులు సీరియస్‌గా తీసుకుని ఇద్దరినీ విధులకు దూరంగా ఉంచినట్లు సమాచారం. వారిపై అంతర్గత విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ పెడ్లర్లతో కానిస్టేబుళ్లకు ఉన్న సంబంధాలు, ఎక్సైసీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈ వ్యవహారంలో ఈగల్ శాఖకు చెందిన మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

## వరంగల్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత!

వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. వర్ధన్నపేటలో కారులో సుమారు 120 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా నుంచి కేరళకు గంజాయిని తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులు ఉపయోగించిన కారు త్రిపుర రాష్ట్రానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. గంజాయి రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## 528.58 చదరపు అడుగుల్లో

# ఇందిరమ్మ ఇల్లు

**మొదటి పేజీ తరువాయి**

నగరపాలక సంస్థలకు దరఖాస్తులు సమర్పించారు. క్యూర్ పరిధిలోని 16 ప్రాంతాల్లో తొమ్మిది, పది అంతస్తుల టవర్లుగా మొత్తం 7,680 ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక్కో ఫ్లాట్ సాధారణ ప్రాంతాలతో కలిపి 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండనుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు నియోజకవర్గాలతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోనూ ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, రెడ్‌హిల్స్, కుల్సుంపుర, నందిముస్లాయిగూడ, పాటిగడ్డ, అంబర్‌పేట్, గడ్డిఅన్నారం, రాయదుర్గం, కౌకూర్, కేపీహెచ్‌బీ, పోచారం తదితర ప్రాంతాల్లో టవర్లు నిర్మించనున్నారు. ఆయా భూముల యాజమాన్య పత్రాలు, నిర్మాణ ప్రతిపాదనలను చీఫ్ సిటీ ప్లానర్ల ఆధ్వర్యంలో అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక్కో టవర్‌కు విడిగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయనున్నారు. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులను దశలవారీగా ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇళ్లతో పాటు ప్రాథమిక సౌకర్యాలు, కామన్ ఏరియాలను కూడా ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు.

# 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. విదేశీపర్యటన ముగి ంచుకుని వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు శు భాకాంక్షలు తెలిపారు. అంతకుముం దు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలుసుకున్నారు. విదేశీ పర్యటన, మం త్రి కొండా సురేఖ అంశంతో పాటు అ మెరికా పర్యటన రద్దుకావడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. మంత్రి కొండా సురేఖ అంశంపై పార్టీ నేతలెవ్వరూ మాట్లాడకుండా కట్టడి చేయాలనే చర్చించినట్లు తెలిసింది. ఆ తర్వాత సచివాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మం త్రి కొండా సురేఖ అంశాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, ఇకపై ఎవ రూ ఆ అంశాన్ని మాట్లాడొద్దని సూచించారు.




నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భూసేకరణను నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావన్నారు. భూసేకరణ, ఆర్‌అండ్ఆర్ నిధులను వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఎమ్మెల్యే, నాయకుడూ తమ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని సీఎం ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్లపల్లి శంకర్, ప్రేమ్‌సాగర్‌రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమాయి, మందుల సామేల్, వేడ్మ బొజ్జు, కోరం కనకయ్య, కాంతారావు, రామ్‌దాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, తెల్లం వెంకట్‌రావు, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళినాయక్, యశస్వినీరెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘువీర్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులున్నారు.

## 24 నుంచి 36 గంటల్లో

# 22ఏ భూముల సమస్య పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి**




వచ్చాయని, పునరావృత కాల్స్‌ను తొలగించిన తర్వాత 980 ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో వ్యవసాయ భూములకు సంబంధించి 547, వ్యవసాయేతర భూములకు సంబంధించి 433 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. అత్యధికంగా రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82 కాల్స్ వచ్చినట్లు వెల్లడించారు. దేవాదాయ, భూదాన్ భూములకు స్లాట్లు బుక్ చేసుకున్నా వాటికి రిజిస్ట్రేషన్లు చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారికి సంబంధిత ఛార్జీలను తిరిగి చెల్లిస్తామని తెలిపారు.

22ఏ భూముల అంశాన్ని అడ్డం పెట్టుకుని కొందరు నకిలీ జీవోలు, పత్రాలను సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఫేక్ జీవోలు, లేఖలు, డాక్యుమెంట్లు తయారు చేసి ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెన్యూన్ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరిస్తామని, ప్రజలు అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని మాత్రమే నమ్మాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్

# లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్

**మొదటి పేజీ తరువాయి**



బ్రాండ్స్‌కు నోటిఫికేషన్ ఇవ్వడంపై సోమవారం ట్విట్టర్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తుం టే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమే షాలు లెక్కిస్తోందని విమర్శించారు. కానీ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందని, యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు, మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే.. మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా? అని మండిపడ్డారు. యువత డిగ్రీలు, పీజీలు పూర్తిచేసి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మద్యం షాపులు పెంచి, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలుచేయాలని చూస్తోందని ఆరోపించారు. సమయానికి యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు.. మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నదని విమర్శించారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మోసం, ఫీజు రీయింబర్స్‌మెంట్ మోసం, రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయింది, మేనిఫెస్టోలో చెప్పిన హామీలకు గతి లేకుండా పోయింది, రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన? అని హరీష్ రావు ప్రశ్నించారు.






# సికింద్రాబాద్ స్టేషన్‌కు ప్రపంచస్థాయి హంగులు..

## 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు

**దశ, హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఎయిర్‌పోర్ట్ తరహా ప్రపంచస్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయిన అనంతరం డిసెంబర్ నుంచి ప్రయాణికులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుతం రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు 180 రైళ్లు ప్రతిరోజూ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నాయి. ఆధునీకరణ అనంతరం ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను రూపొందిస్తున్నారు.

### పార్కింగ్‌తో పాటు ఈవీ ఛార్జింగ్

స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా పార్కింగ్ సదుపాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. బోయిగూడ వైపు బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తుండగా, అక్కడ 120 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 100 పాయింట్లు నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాలకు, 20 పాయింట్లు ద్విచక్ర వాహనాలకు కేటాయించారు. గణేశ్ టెంపుల్ వైపు నిర్మిస్తున్న మల్టీ లెవెల్ పార్కింగ్‌లో మరో 80 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 60 నాలుగు చక్రాల వాహనాలకు, 20 ద్విచక్ర వాహనాలకు వినియోగించనున్నారు. దీంతో రెండు పార్కింగ్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి.

### నగరంలోని ఇతర స్టేషన్లకూ విస్తరణ

సికింద్రాబాద్‌తో పాటు హైదరాబాద్‌లోని ఇతర రైల్వే స్టేషన్లలోనూ ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను విస్తరిస్తున్నారు. హైటెక్ సిటీ, నెక్లెస్ రోడ్, ఫిరోజ్‌గూడ, సుచిత్ర సర్కిల్, నేరేడ్‌మెట్, హఫీజ్‌పేట్, బేగంపేట్, ఉమ్దానగర్, సీతాఫల్‌మండి స్టేషన్లలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగనున్న నేపథ్యంలో ముందుగానే ఛార్జింగ్ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచస్థాయి ప్రయాణికుల సౌకర్యాలతో పాటు పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సికింద్రాబాద్ స్టేషన్‌ను ఆధునిక, ఈవీ ఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

## హెచ్-1బీపై 1.03 లక్షల డాలర్ల వడ్డన

### కొత్త రుసుమును ప్రతిపాదించిన ట్రంప్ సర్కారు

వాషింగ్టన్: హెచ్1బీ ఆశావహులకు ట్రంప్ సర్కారు మరో షాకిచ్చింది. ఈ వీసా దరఖాస్తులపై కొత్తగా 1,03,265 డాలర్ల రుసుమును సోమవారం ప్రతిపాదించింది. అడ్వాన్స్‌డ్ డిగ్రీ మినహాయింపునకు అర్హత ఉన్నవారు సహా హెచ్1బీ వీసా క్యాప్ పరిధిలోకి వచ్చే అన్ని దరఖాస్తులకు ఇది వర్తిస్తుందని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) తెలిపింది. హెచ్1బీ వీసా క్యాప్ మినహాయింపు ఉన్న దరఖాస్తులకు మాత్రం ఈ రుసుము వర్తించదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న హెచ్1బీ దరఖాస్తు రుసుముతో కలిపి కాకుండా.. ప్రత్యేక, అదనపు ఫీజుగా ఈ 1,03,265 డాలర్లను వసూలు చేయనున్నారు. ఈ మేరకు ఫెడరల్ రిజిస్టర్‌లో ఒక నోట్‌ను పోస్ట్ చేశారు. దీన్ని మంగళవారం అధికారికంగా ప్రచురించి.. 30 రోజుల వరకు ప్రజాభిప్రాయాలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది చివరికల్లా కొత్త రుసుమును అమల్లోకి తీసుకురావాలని డీహెచ్ఎస్ భావిస్తోంది.

# అక్రమ నిర్మాణాల సాజిద్.. అసలు కథేంటి?

## గచ్చిబౌలి భవనం కూలిన ఘటనతో వెలుగులోకి సంచలన ఆరోపణలు



**దశ, హైదరాబాద్:** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం నేపథ్యంలో బిల్డర్ సయ్యద్ సాజిద్‌కు చెందిన నిర్మాణాలపై పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కేవలం 48 గజాల స్థలంలో, నాలా పక్కనే ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. శిథిలాల కింద చిక్కుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఉమేశ్ కారే, మోపత్ మృతి చెందారు. సాజిద్ నిర్మించిన పలు భవనాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించారని, కొన్ని భవనాలను హాస్టళ్లుగా నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాలనీ పార్కు స్థలాన్ని ఆక్రమించి మరో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లలో సాజిద్ పలు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినట్లు అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ అనుమతులు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, భూముల యాజమాన్యం, టౌన్ ప్లానింగ్ నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు దృష్టి సారించారు. అనుమతులకు మించి నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణలే కాగా, పూర్తిస్థాయి దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది. భవనం కూలిన ఘటనపై పోలీసులు, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, హైడ్రా సమన్వయంతో దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com